పంచ్ పడుద్ది..!

- సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విద్యార్థినులకు కరాటేలో శిక్షణ
- ఉత్సాహం చూపుతున్న విద్యార్థినులు



రాజంపేట కేజీబీవీ పాఠశాలలో కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

రాజంపేట: పాఠశాల స్థాయిలో విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో కరాటే శిక్షణను పునః ప్రారంభించింది. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రెండేళ్ల కిందట ప్రారంభించినప్పటికీ కరోనా కారణంగా మధ్యలో నిలిపివేసింది. జనవరి 24 బాలికల దినోత్సవాన్ని పురస్కరించకుని రాష్ట్ర ప్రభుత్వం 5,091 పాఠశాలల్లో కరాటే శిక్షణ కార్యక్రమాన్ని పునఃప్రారంభానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థినిలకు ఈ శిక్షణ ద్వారా ఆత్మస్థైర్యం కలిగిస్తుంది. జిల్లాలో రాజంపేట, భిక్కనూర్, బీబీపేట, దోమకొండ, రామరెడ్డి, మాచారెడ్డి, తాడ్వాయి, రామారెడ్డి తో పలు మండలాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినిలకు కరాటే శిక్షణ తరగుతులు అందిస్తున్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విద్యాశాఖ 6 నుంచి పదో తరగతి చదివే విద్యార్థినులకు కరాటేలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలోని 50 పాఠశాలలో కరాటే శిక్షణ ఇసున్నట్లు అధికారులు వెల్లడించారు. పాఠశాల పని వేళల్లో వారానికి 3 రోజులు చొప్పున మూడు నెలల పాటు ఈ శిక్షణ తరగతులు కొనసాగనున్నాయి. శిక్షణ అందించే మాస్టర్ కు ప్రభుత్వం నెలకు రూ. 5 వేల రూపాయాలు చొప్పున వేతనాన్ని అందిస్తుంది. శిక్షణ ద్వారా విద్యార్థుల్లో ఏకగ్రత, ఆత్మస్థైర్యం పెరిగి ఆపద సమయాల్లో దాడుల నుండి తమను తాము రక్షించుకునేందకు ఈ తరగతులు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. శిక్షకులు మూవింగ్ పంచెస్, ప్లేయింగ్ కిక్స్, బ్రేకింగ్ తదితర అంశాల్లో తర్ఫీదు ఇస్తున్నారు.

ఆత్మస్థైర్యం పెరిగింది



కరాటే శిక్షణకు ముందు భయంగా ఉండేది. శిక్షణ ద్వారా ఆత్మస్థైర్యం పెరిగింది. మాస్టర్ శిక్షణలో మంచి మెళకువలతో శిక్షణ ఇస్తున్నారు.
–పూజిత, కేజీబీవీ పాఠశాల, రాజంపేట

భయం పోయింది



కరాటే శిక్షణతో నాలో ఉన్న భయం పోయింది. శిక్షణ ద్వారా ఏకగ్రత కూడా పెరిగింది. చదువుతో పాటు ఇలాంటి శిక్షణలు అందించడం ఆనందంగా ఉంది.
–జి మైత్రి, కేజీబీవీ పాఠశాల, రాజంపేట

ఉత్సాహం చూపుతున్నారు



విద్యార్థినులు కరాటే శిక్షణ కోసం ఉత్సాహం చూపుతున్నారు. ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ఆనందదాయకం. కరాటే ద్వారా విద్యార్థుల్లో చురుకుదనం, ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ఈ తరగతులు సద్వినియోగం అయ్యే విధంగా విద్యార్థులకు మార్గదర్శకం చేస్తున్నాం.
–శ్రీ వాణి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్, రాజంపేట

క్లుప్తంగా

అప్పుల కుప్పగా రాష్ట్రం



కామారెడ్డి టౌన్: రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నీలం చిన్నరాజులు ఆరోపించారు. గురువారం కామారెడ్డిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ దేశ ఆర్థిక పరిస్థితిని మహాశక్తిగా రూపొందించే విధంగా ఉందన్నారు. అదేవిధంగా పేద, మధ్యతరగతికి వారి కోసం బడ్జెట్ రూపొందించారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మ బాలకిషన్, కడెం శ్రీకాంత్, జూలూరి సుధాకర్, పేర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి



సదాశివనగర్: గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు పైళ్ల క్రిష్టారెడ్డి కార్యకర్తలకు సూచించారు. గురువారం ఆయన స్థానిక ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మండల స్థాయి పార్టీ కార్యవర్గ సమావేశానికి హాజరయ్యారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు భూమేష్, నాయకులు భూంరావు, సంకరి విఠల్, ప్రభాకర్ రెడ్డి, రూపెందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పైలేరియా వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం



భిక్కనూరు: పైలేరియా వ్యాధి నివారణకు ప్రభుత్వం ఎన్నో చర్యలను తీసుకుంటోందని ఎంపీపీ గాలిరెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని కాచాపూర్ గ్రామంలో పైలేరియా వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం సరఫరా చేసిన వస్తువులను పంపిణీ చేశారు. పైలేరియా వ్యాధిబారినపడ్డ వారికి ప్రభుత్వం పింఛన్ కూడా ఇస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తోగరి సులోచన, కో ఆప్షన్ సభ్యురాలు సుల్తాన, ఏఎన్ఎం హేమలత పాల్గొన్నారు.

సోనియా దిష్టిబొమ్మ దహనం



కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ దిష్టి బొమ్మను ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం కామారెడ్డిలో దహనం చేశారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రోహిత్ మాట్లాడుతూ శత్రు దేశాల పక్షాన చేరి భారత్‌ను అవమానిస్తున్న సోనియా గాంధీని తక్షణమే దేశం నుంచి తరిమికొట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రోహిత్, ఖలీల్,రాజు, అభి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీతో సోలార్ యూనిట్లు



లింగంపేట: మండలంలోని మోతె గ్రామంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ యునిట్‌ను ఏపీడీ మురళీకృష్ణ గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మోతె శివారులో ఏర్పాటు చేస్తున్న సోలార్ యూనిట్‌కు మహిళా సంఘ సభ్యులు తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా రుణం తీసుకున్నట్లు తెలిపారు. సబ్సిడీపై ఏర్పాటు చేస్తున్న సోలార్ యూనిట్లను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం రవీందర్‌రావు, రమేశ్‌బాబు, సుధాకర్, ఏపీఎంలు మొయిజ్, శ్రీనివాస్, రాజిరెడ్డి, శ్రీనివాస్, సీసీలు రాజిరెడ్డి, మేహర్, స్వరూప, అంజగౌడ్, పద్మ, అరుణ, గంగవ్వ పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్ కోసం ఏర్పాట్లు



ఎల్లారెడ్డి/లింగంపేట: ఇంటర్ ప్రాక్టికల్స్ 15 నుంచి ప్రారంభంకానున్న దృష్ట్యా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని నోడల్ ఆఫీసర్ షేక్ సలాం సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన ఎల్లారెడ్డి, లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. లింగంపేట జూనియర్ కళాశాల స్థలంలో అనుమతుల్లేకుండా చేపట్టిన కట్టడాలను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, రజాక్, కళాశాల అధ్యాపకులు శ్రీనివాసాచారి, రవి తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి



క్రీడాకారులతో ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు



కబడ్డీ పోటీలకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

బాన్సువాడ రూరల్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై దృష్టి సారించాలని ఇబ్రహీంపేట్ సర్పంచ్ నారాయణరెడ్డి సూచించారు. గురువారం స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మాజీ సర్పంచ్ ఉద్దెర గంగప్ప వర్ధంతి సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కళావతి హన్మాండ్లు, నిర్వాహకులు రాజ్‌కుమార్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుషాల్ పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రో కబడ్డీ పోటీలు

బాన్సువాడ టౌన్: పట్టణంలోని మినీ స్టేడియంలో శుక్రవారం నుంచి ప్రో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. నిర్వాహకులు ఇందుకు సంబంధించి ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ఉమ్మడి జిల్లా నుంచి 16 జట్లు పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, పీఈటీలు వెంకటేశ్వర గౌడ్, మధుసుధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సురేందర్, రాజు, నాయకులు అంజిరెడ్డి, ఏజాస్, గోపాల్‌రెడ్డి, పిట్ల శ్రీధర్, బుల్లెట్‌రాజు, హకీం, సత్యం, బాడి శ్రీనివాస్, ముకీద్, కిరణ్, వెంకటేష్, నర్సగౌండ తదితరులు పాల్గొన్నారు.

పోడుభూముల దరఖాస్తుల పరిశీలన



బాన్సువాడ రూరల్: పోడు భూములకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను పరిశీలించడంతో ఆర్డీవో కార్యాలయ అధికారులు బిజీబిజీగా ఉన్నారు. 7న పోడు భూములకు పట్టాలు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో అర్హుల జాబితా తయారీలో అధికారులు బిజీ అయ్యారు.

భవిత సెంటర్‌కు కుర్చీల వితరణ



కామారెడ్డి రూరల్: జిల్లా కేంద్రంలోని ఫిజియోథెరపి సేవలందిస్తున్న దివ్యాంజలి భవిత కేంద్రానికి గురువారం కుర్చీలు, చెవి వినికిడి యంత్రాన్ని విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, ఎంఈవో ఎల్లయ్య, ఎల్లారెడ్డి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొంబోతుల సంపత్‌గౌడ్, ఐఈఆర్‌పీలు భక్తమాల, సారిక తదితరులు పాల్గొన్నారు.

నాలుగు వరుసల రోడ్డుకు నిధులు మంజూరు



మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా నుంచి మాచారెడ్డి ఉన్నత పాఠశాల వరకు నాలుగు వరుసల రోడ్డు ఏర్పాటు కోసం ప్రభుత్వం రూ. 14 కోట్లు మంజూరు చేసింది. అందుకు కృతజ్ఞతగా సీఎం కేసీఆర్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ చిత్రపటాలకు గురువారం గజ్యానాయక్ తండాలో క్షీరాభిషేకం చేశారు. సర్పంచ్ హంజీ నాయక్, ఉప సర్పంచ్ తోకల కిషన్, నాయకులు ఫకిరా నాయక్, అబ్దుల్ ఖాన్, శ్రీధర్ రావు, షేక్ జహంగీర్, శంకర్, జైనుల్, ప్రకాష్, ఎల్లాగౌడ్, శ్రీరామ్, శ్రీనివాస్, హనుమంతరావు, రాజేశ్వర్, ఎడపల్లి శ్రీనివాస్, నారాగౌడ్, వెంకటిగౌడ్, ఎజాజ్ పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్

తాడ్వాయి: మండల కేంద్రమైన తాడ్వాయిలో ఇంటి పన్ను వసూలు కోసం అధికారులు గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇంటింట తిరుగుతూ పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులు, నల్లా బిల్లులను వసూలు చేశారు. ఇంటి పన్ను చెల్లించని వారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు ఎంపీడీవో రాజ్‌వీర్ తెలిపారు. గ్రామ కార్యదర్శి బాలు, సుగుణాకర్ రెడ్డి, స్వామిరెడ్డి, గంగారాం పాల్గొన్నారు.

బీబీపేట: వంద శాతం పన్నులు వసూలు చేయాలని ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ సూచించారు. మాందాపూర్‌లో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పంచాయతీ కార్యదర్శులు నవీన్, ఇంతియాజుద్దిన్ ఇంటి పన్నులు వసూలు చేశారు.



ఉద్యోగ భద్రత కల్పించాలి



రాజంపేట: ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశావర్కర్లు గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల వైద్యాధికారి శిరీషకు వినతి పత్రం అందజేశారు.

నస్రుల్లాబాద్(బీర్కూర్): ఆశా కార్యకర్తలు బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. పని భారం తగ్గించడంతో పాటు ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అడవిని తలపిస్తున్న పల్లెప్రకృతి వనం



పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

సదాశివనగర్: మండల కేంద్రమైన సదాశివనగర్ పల్లెప్రకృతి వనం అడవిని తలపిస్తోందని అసిస్టెంట్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. అభివృద్ధికి కృషి చేసిన సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డిని ఆయన అభినందించారు. అసిస్టెంట్ కలెక్టర్ గురువారం పల్లెప్రకృతి వనం, అవెన్యూప్లాంటేషన్, స్మశానవాటిక, కంపోస్ట్ షెడ్, ఈతవనం, మధ్యాహ్నభోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కంపోస్ట్ షెడ్‌లో సేంద్రియ ఎరువును తయారు చేస్తున్న విధానాన్ని సర్పంచ్ వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేందర్‌రెడ్డి, ఏపీవో మధు, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ బీరయ్య, ఉప సర్పంచ్ వంకాయల రవి, వీడీసీ చైర్మన్ కుమ్మరి రాజు, వార్డు సభ్యులు జగ్గ బాల్‌రాజు, పెసరి సాయిలు, సంతోష్‌రెడ్డి, మమత పాల్గొన్నారు.

కరెంటు కష్టాలు తీర్చండి

- మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అశోక్

బిచ్కుంద: గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న కరెంటు కష్టాలు తీర్చండి అంటూ పలువురు ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. వ్యవసాయానికి కనీసం ఏడు గంటలు కూడా విద్యుత్ సరఫరా చేయడం లేదని పేర్కొన్నారు. గురువారం ఎంపీపీ అశోక్ పటేల్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాంతాపూర్, దద్గి, పెద్దదేవాడ వైకుంఠధామం వద్ద కరెంటు సౌకర్యం లేదు, విద్యుత్ స్తంభాల కోసం డీడీలు చెల్లించి నెలలు గడుస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు ఉపాధ్యాయులు పాఠశాలకు రాకుండా డుమ్మా కొడుతున్నారని, మరికొందరు సమయపాలన పాటించడం లేదని ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎంఈవో రాములను సితరాంపల్లి, పెద్ద దేవాడ సర్పంచులు నిలదీశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు మండలం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఎంపీపీ అశోక్ పటేల్ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన 12 గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు రూ.2.4 కోట్లు, 8 హెల్త్ సబ్‌సెంటర్ల కోసం రూ. 1.60 కోట్లు, వరదలతో తెగిపోయిన రోడ్ల మరమ్మతులకు రూ. 1.85 కోట్లతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఇంటిపై సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకుంటే రాయితీపై ప్రభుత్వం సోలార్ కిట్లు అందిస్తుంది, వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన సర్పంచ్‌లకు సూచించారు. తహసీల్దార్ రవికాంత్, ఎంపీడీవో ఆనంద్, జెడ్పీటీసీ సభ్యురాలు నాల్చర్ భారతి, పుల్కల్ ఏఎంసీ చైర్మన్ రాంరెడ్డి, ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు సిద్దిరాం ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



దోమకొండ మండలం అంచనూరులో కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీడీవో చిన్నారెడ్డి

దోమకొండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కేంద్రాల్లో కంటి పరీక్షలు చేయించుకొవాలని ఎంపీడీవో చిన్నారెడ్డి సూచించారు. గురువారం ఆయన మండలంలోని అంచనూరులో నిర్వహిస్తున్న కేంద్రంలో ఆయన కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బురాని సమత, ఉపసర్పంచ్ నరేష్, ఐకేపీ ఎపీఎం రాజు, పంచాయితీ కార్యదర్శి రాజశేఖర్, ఐకేపీ సీసీ రాజేశం, తదితరులు ఉన్నారు.

పిట్లం: మండలంలోని హస్నాపూర్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. అర్హులైన వారికి పంచాయితీ అధికారి బ్రహ్మం కంటి అద్దాలు పంపిణీ చేశారు.

తాడ్వాయి: కంటి వెలుగు కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటింట తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నర్సిములు, సర్పంచ్ సంజీవులు, ఎంపీడీవో రాజ్ వీర్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని అన్నాసాగర్, తిమ్మారెడ్డి గ్రామాల్లో కంటి వెలుగు కేంద్రాలను ఆయా గ్రామాల సర్పంచులు నాగరాజు, మహ్మద్ అబ్దుల్ అలీలు ప్రారంభించారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



బుడిమిలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏఈవో



తడి, పొడి సాగుపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బాన్సువాడ రూరల్: పంట పొలాల్లో రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని బోర్లం క్లస్టర్ ఏఈవో గోపాల్ రైతులకు సూచించారు. గురువారం ఆయన బుడిమి గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు.

సదాశివనగర్: మండలంలోని ఉత్తునూర్ గ్రామంలో ఏఈవో శిరీష వరి పంటను పరిశీలించి తెగుళ్ల నివారణకు రైతులు తీసుకోవల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

తడి, పొడి సాగుపై అవగాహన

కామారెడ్డి రూరల్: తడి, పొడి సాగు విషయమై కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్స్, పద్మపాని సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం మండలం క్యాసంపల్లిలో రైతులకు అవగాహన కల్పించారు. నీటి పొదుపుగా వాడేందుకు వీలుగా నీటి గొట్టాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సందిరి మంజుల నారాయణరెడ్డి, స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్లు రజిత, కొప్పుల రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

పిట్లం: ప్రభుత్వం సరఫరా చేసిన దుప్పట్లను పెద్ద కొడపగల్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు గురువారం ఎంపీడీవో పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నళిని, ఎంపీవో సూర్యకాంత్, సర్పంచ్ తిర్మల్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

దూడలకు టీకా

పిట్లం: మండలంలోని గొద్మెగాం, చిల్లర్గి గ్రామాలలో పశువైద్య సిబ్బంది గురువారం ఆడ దూడలకు టీకా వేశారు. పశువైద్యాధికారి సంతోష్ మాట్లాడుతూ బ్రూసెళ్ళ అబార్షస్ టీకా వేయించడం వల్ల దూడలకు జీవితాంతం రక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

అడ్మిషన్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి: గిరిజన గురుకుల కళాశాలల్లో ఇంటర్‌లో అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని గురుకుల కళాశాల ప్రిన్సిపల్ వాణి తెలిపారు.

కూలీల జాబ్ కార్డులకు ఆధార్ లింక్ చేయాలి

లింగంపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామి కూలీల జాబ్ కార్డులకు ఆధార్ లింక్ చేయాలని ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి సిబ్బందికి సూచించారు.

పనులు వేగవంతం చేయాలి

నాగిరెడ్డిపేట: మన ఊరు–మన బడి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో రఘు సూచించారు. మండలంలోని జప్తిజాన్కంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో చేపట్టిన పనులను గురువారం సర్పంచ్ దేశబోయిన సాయిలుతో కలిసి ఆయన పరిశీలించారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

లింగంపేట: మండలంలోని సురాయిపల్లి తండా ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి సింగిల్ విండో చైర్మన్ దేవేందర్‌రెడ్డి రూ. 25 వేలు విరాళం అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామోదర్ తెలిపారు.

గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం

తాడ్వాయి: మండలంలోని సంతాయిపేట్, చిట్యాల, సోమారం గ్రామాల్లో పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్ ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేపట్టారు. డుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. నాయకులు జంగం రాజు, వెంకట్‌రాంరెడ్డి, మదుసుదన్‌రావు, లక్ష్మన్‌రావు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

రాజంపేట: ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో బాలకిషన్, ఎంపీవో రఘురాం ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కార్యదర్శులను ఆదేశించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలంధర్‌రెడ్డితో కలిసి మున్సిపల్ చైర్మెన్ సత్యనారాయణ గురువారం పంపిణీ చేశారు.

బీఆర్ఎస్‌తో వారికి సంబంధం లేదు

ఎల్లారెడ్డి: కాంగ్రెస్‌లో చేరిన రుద్రారం, సాతెలి సర్పంచ్‌లు సత్తయ్య, సంఘమేశ్వర్‌లతో బీఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జలందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ చైర్మెన్ సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు సతీష్ తదితరులు ఉన్నారు.

పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరణ

దోమకొండ: మండల కేంద్రంలో పీఆర్‌టీయూ డైరీని జెడ్పీటీసీ సభ్యుడు తీగల తిర్మల్‌గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు పుట్ట శ్రీనివాస్ రెడ్డి, పన్యాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేవైసీఎస్ క్యాలెండర్ ..

రాజంపేట: మండలంలోని పొందుర్తిలో కరుమ యువజన చైతన్య సమితి (కేవైసీఎస్) ముద్రించిన క్యాలెండర్‌ను సర్పంచ్ పని గంగకిషన్, ఎంపీటీసీ బాల్‌రాజ్ గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, కేవైసీఎస్ జిల్లా కోశాధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి

ఎల్లారెడ్డిరూరల్: హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని వాహనదారులకు ఎస్సై గణేష్ సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న పలువురు రోడ్డు ప్రమాదాలకు గురై తీవ్రంగా గాయపడ్డ విషయాన్ని గుర్తు చేశారు.

సర్పంచ్ రక్తదానం

లింగంపేట: మండలంలోని సురాయిపల్లిలో అనీమియా వ్యాధితో బాధపడుతున్న నూర్‌సింగ్‌కు రక్తం అవసరం కావడంతో లింగంపల్లి సర్పంచ్ రాజయ్య రక్తదానం చేశారు.

అర్చక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడి నియామకం

మాచారెడ్డి: అర్చక ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడిగా వేల్పూరి నర్సింహ చార్యులు ఎన్నికయ్యారు. ఆయన ప్రస్తుతం మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అర్చకునిగా పని చేస్తున్నారు.

మున్నూరుకాపు సంఘం..

భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా కేతిస్వామి, ఉపాధ్యక్షుడిగా కేతి శ్రీనివాస్, కోశాధికారిగా బాల్‌రాజు ఎన్నికయ్యారు.

పంచాయతి భవన నిర్మాణానికి భూమిపూజ

బాన్సువాడ రూరల్: మండలంలోని ఇబ్రాహింపేట్ తండా గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి సర్పంచ్ ప్రేమ్‌సింగ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నారాయణరెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు దేవారం నారాయణరెడ్డి, ఉద్దెర హన్మాండ్లు, కిషన్‌నాయక్, మోహన్, బాబుసింగ్, చందర్, అంబు, గోవింద్ పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.25 కోట్లు మంజూరు

రాజంపేట: మండలంలోని లింగాయిపల్లి మొండివాగుపై మైనర్‌బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.25 కోట్లు మంజూరు చేసింది. బ్రిడ్జి లేక వర్షాకాలంలో మండలానికి పూర్తిగా రాకపోకలు నిలిచిపోయేవి. ఇబ్బందులపై 'వరదొస్తే దాటేదెట్లా' అనే శీర్షికన ఇటీవల సాక్షి దిన పత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. మొండివాగు మైనర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.